ఘనంగా ఆరట్టు కార్యక్రమం

ఘనంగా అయ్యప్ప స్వామి ఆరట్టు కార్యక్రమం

ఆర్మూర్ టౌన్, డిసెంబర్9: పట్టణంలోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురుస్వామి నగేశ్ శర్మ సమక్షంలో శనివారం ఆరట్టు కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి నగేశ్ శర్మ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

జెనెకిట్ వ్యాధులపై అవగాహన

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థినులు

మాక్లూర్, డిశంబర్9: మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ సహకారంతో జెనెటిక్ డిసీజెస్ 'జీన్-హెల్త్-కనెక్ట్'పై మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థినులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. రక్త సంబంధమైన వివాహాలు చేసుకుంటే వివిధ రకాల జన్యుపరమైన వ్యాధులు ఎలా సంక్రమిస్తాయో విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాసవీలత, లైఫ్ సైన్స్ విభాగంలో సమన్వయ కర్తలుగా ఈ.సంధ్య, ప్రియదర్శిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ

మోర్తాడ్, డిసెంబర్9: ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహించిన నేషనల్ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రం తరపున తిమ్మాపూర్ విద్యార్థులు సాయినాథ్, రుతిక పాల్గొని ప్రతిభ చూపారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్, ఎంపీటీసీ అస్మా అజారుద్దీన్, ఉప సర్పంచ్ నవీన్, గ్రామస్తులు అభినందించారు.

సెలవుపై బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

శక్కర్‌నగర్, డిసెంబర్ 9: బోధన్ ఏసీపీ కేఎం కిరణ్ కుమార్ సొంత పనుల కారణంగా సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో నిజామాబాద్ సీసీఎస్‌కు చెందిన విజయ్ కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. శనివారం పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఏసీపీ పాల్గొన్నారు. ఏసీపీ కిరణ్ కుమార్ మూడు రోజుల సెలవుపై వెళ్లినట్లు సమాచారం.

బాధితుడికి సెల్ ఫోన్ అందజేత

ఫోన్ ను అందిస్తున్న ఏఎస్సై సురేశ్

ముప్కాల్, డిసెంబర్ 9: మండల కేంద్రంలోని మహేశ్వర్ గౌడ్ కొన్నిరోజుల క్రితం తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఫోన్ ఆచూకీ తెలుసుకొన్నారు. దానిని శనివారం మహేశ్వర్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్‌కు ఏఎస్సై సురేశ్ అందజేశారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

మెండోరా, డిసెంబర్ 9: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉందని ఏఈఈ రవి శనివారం తెలిపారు. కాకతీయ కాలువకు 100, సరస్వతి కాలువకు 50 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుందని అన్నారు. మిషన్ భగీరథ తాగునీటి కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1088.70 అడుగులు (78.661 టీఎంసీలు) నీటి నిల్వ ఉందన్నారు.

మహిళలు బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌లో బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి

ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఏసీపీ జగదీశ్ చందర్

బోధన్, డిసెంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి అన్నారు. శనివారం బోధన్ డిపో ఆధ్వర్యంలో బోధన్ బస్‌స్టాండ్‌లో ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె బస్సులో మహిళా కండక్టర్ల నుంచి జీరో పేర్ టిక్కెట్‌ను తీసుకున్నారు. అక్కడి నుంచి శక్కర్‌నగర్ వరకు ఆమె మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో బోధన్ ఇన్‌చార్జి ఏసీపీ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ బి.గంగాశంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, అంకు సంధ్య దాము, సంగీత హన్మంత్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, మీర్ నజీర్ అలీ, నాయకులు పాషా మొయినుద్దీన్, డి.నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్9: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు వినయ్ రెడ్డి హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

కమ్మ సంఘం రజతోత్సవాలు ప్రారంభం

రంగవల్లుల పోటీలో పాల్గొన్న మహిళలు

తొలిరోజు వివిధ సాంస్కృతిక, ఆటల పోటీల నిర్వహణ

బోధన్, డిసెంబర్ 9: బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘం భవనం ప్రాంగణంలో ఆ సంఘం రజతోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ రజతోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం మహిళలు, పురుషులకు వివిధ సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు రంగవల్లులు (ముగ్గుల) పోటీలు నిర్వహించారు. మహిళలకు మ్యూజికల్ చైర్, ఫన్నీ గేమ్స్ నిర్వహించారు. పురుషులకు ఖోఖో, క్రికెట్ పోటీలు, సీనియర్ సిటిజన్స్‌కు మ్యూజికల్ చైర్ పోటీ నిర్వహించారు. ఈ వేడుకలను కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, కార్యదర్శి దావులూరి హరనాథ్‌బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్‌బాబు, రజతోత్సవాల ప్రోగ్రాం చైర్మన్ గంగవరపు ఆదినారాయణ, ప్రోగ్రాం కో-చైర్మన్ ఎం.అప్పారావు, కమ్మ సంఘం ప్రతినిధులు పి.గాంధీ, ఇ.వి.రంగారావు, పెనుమర్తి శ్రీహరి, అశోక్, కరుటూరి సూర్యనారాయణ, మేదరమెట్ల రమేశ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మొరం క్వారీలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

మొరం క్వారీపై దాడులు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మాక్లూర్, డిసెంబర్ 9 : మండలంలోని సింగంపల్లి, మాదాపూర్ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్ క్వారీలపై సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య సమాచారంతో మాక్లూర్ పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. సింగంపల్లి శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న 2 టిప్పర్లు, మాదాపూర్ శివారులో 2 టిప్పర్లు, జేసీబీతో పాటు సింగంపల్లి క్వారీ, చిన్నాపూర్‌కు చెందిన క్వారీలో బండరాళ్లను పగులగొట్టే పేలుడు పదార్థాలు (బూస్టర్స్), ఇటాచీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. శుక్రవారం రాత్రి క్వారీలపై దాడులు జరిగిన నేపథ్యంలో మైన్స్ ఏడీ సత్యనారాయణ, రూరల్ సీఐ సతీశ్, గిర్దావర్ షఫీ క్వారీలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్వారీలు నిర్వహిస్తున్న ప్రదేశంలో బండరాళ్లను పగులగొట్టే పేలుడు పదార్థాలు (బూస్టర్స్) లభించడంతో పంచనామా నిర్వహించిన అనంతరం క్వారీ నిర్వాహకుడు గంగారెడ్డితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుకున్న టిప్పర్లు, జేసీబీ, ఇటాచీ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులు

మెండోరా, డిసెంబర్ 9: పోచంపాడ్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి.మోహీత్, ఎస్‌కె.ఆల్మాస్‌లు బీచ్ వాలీబాల్ పోటీల్లో చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ భూపతి శనివారం తెలిపారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

భీమన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

గంగా జలాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మెండోరా, డిసెంబర్ 9: మండల కేంద్రంలో శనివారం నుంచి నాయకపోడ్ సంఘం గ్రామస్తుల ఆధ్వర్యంలో భీమన్న కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం గ్రామంలో భీమన్న ఆలయం నుంచి ఏనుగుల ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. భక్తిశ్రద్ధలతో భీమన్న ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుని ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆదివారం భీమన్న కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకపోడ్ సంఘ సభ్యులు తెలిపారు.

ఖననం చేసిన గోవులకు పోస్టు మార్టం

రెంజల్, డిసెంబర్ 9: లారీలో ఊపిరాడక మృతి చెందిన పశువులను నిందితులు ఖననం చేయగా వాటిని శనివారం బయటికి తీయించి పశువైద్యాధికారి నరేందర్ పోస్టు మార్టం నిర్వహించారు. సాటాపూర్ గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే పశువుల వారసంతకు శుక్రవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వైపు నుంచి లారీలో సామర్థ్యానికి మించి పశువులను తీసుకువచ్చారు. ఊపిరాడక కోడె, గోవు మృతి చెందిన విషయం తెలిసిందే.. వారసంతకు 30 ఎద్దులు, 12 ఆవులను తీసుకుని వచ్చారు. వాటిని లారీ నుంచి దించుతుండగా ఒక కోడె, ఒక ఆవు మృతి చెంది ఉన్నాయి. ఈ విషయమై నీలా గ్రామానికి చెందిన యువకుడు గౌరాజీ శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే లోపు వ్యాపారులు పశువులను ఖననం చేశారు. సీపీ ఆదేశాల మేరకు శనివారం సంఘటన స్థలానికి చేరుకున్న బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్ ఖననం చేసిన ఆవు, కోడె మృతదేహాలను బయటికి తీయించగా వైద్యుడు నరేందర్ పోస్టు మార్టం నిర్వహించారు. లారీ యజమాని పరారీలో ఉండగా, డ్రైవర్, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ సీఐ తెలిపారు.